

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

కాకినాడ జిల్లా
కోనసీమ జిల్లా
తూర్పు గోదావరి జిల్లా
అల్లూరి సీతారామరాజు జిల్లా

సోమవారం,8 సెప్టెంబర్ 2025

8 పేజీలు


# సేవే లక్ష్యం..ప్రజలే ముఖ్యం

- భవిష్యత్‌కు భరోసా వాసంశెట్టి
- సాయంలో ఆయనకు ఆయనే సాటి



ఆపదలో ఉన్నవారికి ధన సహాయం అందిస్తున్న మంత్రి వాసంశెట్టి సుభాష్



రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్

**ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో :**

ముఖంపై చెరగని చిరునవ్వు...! చెప్పే మాటలలో స్పష్టత..! చేసే పనుల్లో నిజాయితీ..! రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ గురించి మూడే మూడు వాక్యాల్లో చెప్పమని ఎవరైనా అడిగితే..ఇలా చెప్పొచ్చు. సమస్యల పరిష్కారం కోసం వచ్చేవారు ఎవరైనా సరే ఆయన ఆప్యాయంగా పలకరిస్తారు.సావధానంగా విని భరోసా ఇస్తారు. మాట ఇస్తే చేసే తత్వం ఆయనిది. దశాబ్దాల అనుభవం ఉన్న కీలక నాయకులు కొలువైన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రాజకీయం నిత్యం వైకుంఠ పాళిమాదిరిగానే ఉంటుంది.ఆడటం, నిలవటం, నిచ్చెనలు ఎక్కడం, పాములను తప్పించుకోవడం తొలి సారి మంత్రికి అంత సులువు కాదు. ఎన్నికలబరిలో దిగడంతోనే ఆయనకు సవాళ్ళు ఎదురయ్యాయి.నిలిచి..గెలిచారు.

ఆట కొన సాగిస్తూనే ఉన్నారు. సమస్యలను ఒక్కొక్కటిగా దాటుకుంటూ రామచంద్రపురం నియోజకవర్గాన్ని అభివృద్ధి నిచ్చెనలను ఎక్కిస్తున్నారు. రాజకీయ చతురత, అభివృద్ధిపై దూరదృష్టి, సంక్షేమం అమలులో మానవీయత కనబరుస్తున్నారు.

**సాయంలో ఆయనకు ఆయనే సాటి....!**

నమ్మి వచ్చిన నాయకులు, పార్టీ కార్యకర్త లను తన సొంత కుటుంబ సభ్యులుగా భావించి అండగా నిలుస్తారు వాసంశెట్టి సుభాష్.వారికి ఏ కష్టమొచ్చినా స్పందిస్తారు. చేయూతనిస్తారు. రామచంద్రపురం నియోజక వర్గ ప్రజలనూ అలాగే చూసుకుంటారు. ఇంతేనా..? ఏప్రాంతంలో ప్రజలకు కష్టంవచ్చినా మానవనీయంగా వ్యవహరిస్తారు. విజయవాడలో వరదలు వచ్చిన సమయంలో ఆయన చేసిన సేవలు అమూల్యం. అక్కడి ప్రజల

- తరువాయి 2లో..

## కృషి పట్టుదలే
# శ్యామ్ విజయాలు



**ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో :**

విద్యార్థులు చూపిన కృషి అధ్యాపకుల పట్టుదల కలయికతో శ్యామ్ ఇన్స్టిట్యూట్ విజయాలు సాధించిందని శ్యామ్ ఇన్స్టిట్యూట్ అధినేత గుంటూరు తణుకులు (శ్యామ్) అన్నారు. ఎందరో ఉద్యోగస్తులను అందివ్వాలని తపనతో 2001లో శ్యామ్ ఇన్స్టిట్యూట్ అనే సంస్థను స్థాపించి ఎందరో ఉద్యోగులుగా తీర్చిదిద్దడంలో తమ సంస్థ ఎనలేని పాత్ర ఉందని శ్యామ్ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఆదివారం విద్యుత్ నగర్లో ఏపీ పోలీస్ కానిస్టేబుల్స్ విజేతల సభ, శ్యాం ఇన్స్టిట్యూట్ 25 సంవత్సరాల రజతోత్సవ వేడుకల కార్యక్రమాన్ని సంస్థ ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ కానిస్టేబుల్ పరీక్ష ఫలితాల్లో

- తరువాయి 2లో..

స్థిరమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని పట్టుదలతో విజయం సాధించే వరకు కృషి చేయడం ద్వారా అపజయం తలవంచి విజయం వైపు చేరువ చేస్తుందని అతను నమ్మి వేలాది మందిని యువతను ఆదిశగా పయనింపజేసిన మహాశక్తి శ్యామ్ ఇనిస్టిట్యూట్ అధినేత గుంటూరు తణుకులు మాష్టారు. తెలివితేటలు, సాధించగల సత్తా ఉన్న సరైన వేదిక లేకపోవడం వలన ఎందరో నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారని గుర్తించిన శ్యామ్ మాస్టర్ ఓ తపనతో 2001లో శాంతి ఇనిస్టిట్యూట్ అనే సంస్థను స్థాపించి నేడు వేలాది మందికి ఉద్యోగాలు ఇప్పించిన ఘనతను మూట కట్టుకున్న మహెూన్నత మాస్టారుగా రాష్ట్రంలోనే కీర్తి పతాకాలను ఎగురవేశారు.25 సంవత్సరాల రజతోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు.

## ప్రాణాలపై ఆశ వదులుకున్న..
# మంత్రి సుభాష్ ప్రాణభిక్ష పెట్టారు

-అప్లాస్టిక్ ఎనీమియా రోగికి రూ.5 లక్షలు సీఎంఆర్ఎఫ్ సహాయం

-ఎల్ఓసి ద్వారా బాధితుని ప్రాణాలకు భరోసా ఇచ్చిన మంత్రి సుభాష్

**కాజులూరు, మేజర్‌న్యూస్ :** ముఖ్యమంత్రి సహాయ నిధి(సీఎంఆర్ఎఫ్)ఎంతోమందిఅభాగ్యుల ప్రాణాలను కాపాడుతోంది అనటానికి ఇదొక నిదర్శనం. అరుదైన అప్లాస్టిక్ ఎనీమియా వ్యాధితో బాధపడుతున్న బాధితునికి రాష్ట్రకార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ కొండంత అండగా నిలిచి సీఎంఆర్ఎఫ్ సహాయ నిధి ద్వారా రూ.5లక్షల లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్ఓసి)అందించి రోగి బతుక్కి బాసటగా నిలిచారు. వివరాల్లోకి వెళితేకాజులూరు మండలం పల్లిపాలెంకు చెందిన ముడికితిరుపతిరావు గత 18సంవత్సరాలుగా అప్లాస్టిక్ ఎనీమియా అనేఅరుదైనవ్యాధితో బాధపడు తున్నాడు. దీనికి వైద్యులు ఆపరేషన్ చెయ్యాటానికి రూ.12 లక్షల వరకు ఖర్చు అవుతుందని తెలిపారు. పేదరికంలో ఉన్న తిరుపతిరావు ఆపరేషన్ చేయించుకునే స్తోమత లేక గత 18సంవత్సరాలుగా ఆర్థిక సహాయం కోసం ఎదురు చూస్తున్నాడు.సాయం కోరుతూ రాజకీయ నాయకులు చుట్టూ ప్రదక్షిణలు చేస్తూనే ఉన్నాడు.కానీఏఒక్క నాయకుడు కనికరించ లేదు. రక్తదాతలు,బ్లడ్ బ్యాంక్‌ల సహకారంతో నెలలో రెండుసార్లు రక్తం ఎక్కించుకుంటూ ప్రాణాల నిలుపు కుంటూ వస్తున్నాడు.భార్య,ఇద్దరుపిల్లలతో దారిద్రాన్ని అనుభవిస్తూ బతకీడుస్తున్నాడు. కాజులూరు మండల



పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు తన దీనస్థితిని, ఆరోగ్య పరిస్థితిని విన్నవించుకున్నాడు. బాధితుని సమస్యలు విన్న మంత్రి చలించి పోయారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థిక సహాయం అందేలా చూస్తానని భరోసా ఇచ్చి తక్షణమే మెరుగైన వైద్యం పొందేలా ఆకాంక్షిస్తూ రూ.5లక్షలు లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్ఓసి) బాధితునికి అందించారు. ఈసందర్భంగా బాధితుడు తిరుపతిరావు

- తరువాయి 2లో..

# సేవే లక్ష్యం... ప్రజలే ముఖ్యం



వాసంశెట్టి ఫౌండేషన్‌తో ప్రజలకు అవసరమైన సేవాకార్యక్రమాలు అందిస్తున్న ఛైర్మన్ వాసంశెట్టి సత్యం



డిప్యూటి సీఎం పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించిన దృశ్యం



మంత్రి సుభాష్‌ని పూలమాలలతో ఘనంగా సత్కరించిన అభిమానులు



వృద్ధాప్య పించన్లు అందిస్తున్న మంత్రి వాసంశెట్టి సుభాష్

మొదటిపేజీ తరువాయి

కష్టాలు,కన్నీళ్ళు చూసి సుభాష్ చలించిపోయారు. పార్టీ శ్రేణులతో కలిసి ముందుకు కదిలారు.బాధితుల సహాయార్థం ప్రత్యేక వాహనాల్లో కూరగాయలు, తినుబండారాలు ఇతర సామాగ్రి పంపి తన మంచి మనసును చాటుకున్నారు. వాసంశెట్టి సుభాష్ నుంచి స్ఫూర్తి పొందిన ఇతర నాయకులు భారీగా విరాళాలు సేకరించి ఆమొత్తాన్ని ఆయన చేతుల మీదుగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు అందజేశారు.

**పార్టీ శ్రేణులకు...!!**

నమ్మి వచ్చిన నాయకులు,పార్టీ కార్యకర్త లను సుభాష్ సొంత మనుషుల్లా చూసు కుంటారు.కష్టాల్లో ఉన్నారని తెలిస్తే దరి చేర్చుకుంటారు. అని పార్టీనాయకులు అంటున్నారు. కార్యకర్తలు,పార్టీ శ్రేణులు సైతం "అన్నా" అని సాయం కోరితే ఏంకావాలో చెప్పు?అని అడిగి సమస్యను పరిష్కరి స్తారు. నమ్మి ఓటు వేసిన ప్రజలు, నమ్మి తన వెంట నడిచిన శ్రేణులకు ప్రజాప్రతినిధిగా, నాయకుడిగా ,శ్రేయోభిలాషిగా అండగా ఉంటున్నారు. రామచంద్రపురం నియోజకవర్గంలో ప్రగతి పసిడి కాంతులు నింపుతున్నారు.

**"మన ఫ్యామిలీ"గా కుటుంబ సభ్యులు సైతం**

కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యులు సైతం నియోజకవర్గ ప్రజలను "మన ఫ్యామిలీ"అన్నట్టుగా సేవలందించేందుకు అడుగులేస్తున్నారు.మంత్రికి అండగా ఉంటూ ఆయన తండ్రి వాసంశెట్టి సత్యం తలలోనాలుకలా వ్యవహరిస్తున్నారు. ఒకవైపు తనయుడు మంత్రి హోదాలో బిజీగా ఉంటున్నప్పటికీ వాసంశెట్టి సత్యం మాత్రం నియోజకవర్గానికే అంకితమై ప్రజల కష్టాల్లో పాలు పంచుకుంటున్నారు.ఇది గిట్టని ప్రత్యర్థులు సత్యంపై లేనిపోని విమర్శలు చేస్తున్నప్పటికీ వాటిని బేఖాతరు చేస్తూ తన పని తాను చేసుకుంటూ సుభాష్ కు కొండంత అండగా నిలుస్తున్నారు. వాసంశెట్టి సత్యం ఫౌండేషన్‌ను ఏర్పాటు చేసి ఎన్నో కార్యక్రమాలను చేపట్టి ప్రజలకు చేరువకావడాన్ని ప్రత్యర్థులు జీర్ణించుకోలేక పోయారు. సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్నారు. అందులో ముఖ్యంగా నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలన్న లక్ష్యంతో జాబ్ మేళాలు నిర్వహించడం ఒక సంచలనం. ఇప్పటివరకు దాదాపు ఇరవై వరకు జాబ్ మేళాలు నిర్వహించి ఎందరో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించారు.అంతేకాదు గూడులేని నిరుపేదలకు తన సొంత నిధులతో ఇళ్ళు కట్టించారు.చదువును మధ్యలోనే ఆపేసిన పిల్లలను తిరిగి పాఠశాలల్లో చేర్పించి కార్పొరేట్ విద్యను అందించడంలో సుభాష్ కుటుంబ సభ్యుల పాత్ర ఎంతో ఉంది. ఇటీవల ఒక మహిళ తనకు పింఛన్ రావడం లేదన్న విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకువచ్చేందే తడవుగా ప్రతినెల అయిదు వేల రూపాయలు ఇస్తానని మాట ఇచ్చారు. అంతేకాదు అప్పటకప్పుడు తన సొంత డబ్బులు అయిదు వేల రూపా యలు ఆమహిళకు అందించి తన ఉదారతను చాటుకున్నారు.

**భవిష్యత్తుకు భరోసా....!**

గత ఏడాది కాలంలో రామచంద్రపురం నియోజకవర్గాన్ని రూ. 125 కోట్లతోఅభివృద్ధి చేయడమే కాకుండా కోట్లాది రూపాయలు అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు పంపించారు. భవిష్యత్తుకు భరోసా కల్పించేలా వాసంశెట్టి సుభాష్ అడుగులు వేస్తున్నారు.

**మానవత్వం.. దయాగుణం ఆయన ఆయుధాలు**

ప్రజలే ముఖ్యమని.. సేవే లక్ష్యంగా ముందుకు సాగిపోతున్నారు మంత్రి సుభాష్. ముఖ్యంగా మహిళలు, వితంతువులు, నిరుద్యోగులు, దివ్యాంగులు, అనాథలు, వృద్ధులు పట్ల ప్రేమ, దయాగుణం చూపిస్తూ సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ద్వారా వ్యక్తిగతంగా ఆదుకుంటూ.. ఆర్థిక సాయం అందిస్తూ.. తన ప్రేమని వెల్లడి చేస్తున్నారు. అన్ని వర్గాల ప్రజల మనసులు గెలుచుకున్న 'మా రాజు' గా పేద ప్రజల గుండెల్లో గూడు కట్టుకున్నారు. మానవత్వమే అసలైన దైవ తత్వమని బలంగా నమ్మే నాయకుడు మంత్రి సుభాష్. అభివృద్ధి సంక్షేమం పట్ల ఒక ప్రత్యేకమైన ప్రణాళిక కలిగి రాష్ట్ర రాష్ట్రాభివృద్దే లక్ష్యంగా ఉన్నత ఆశయంతో ముందుకు సాగిపోతున్నారు.

# సమాజ సంస్కరణకు సాహితీ ఆయుధం జాషువా

**– గుర్రం జాషువా జయంతోత్సవాలను ప్రారంభించిన ఎమ్మెల్యే అంజిబాబు**



**భీమవరం,మేజర్‌న్యూస్ :** సమాజ సంస్కరణకు సాహిత్యాన్ని ఆయుధంగా ఎంచుకుని అసమానతలపై గళమెత్తిన నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా అని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. ఉషోదయ ఫౌండేషన్ (తిరుపతి) అధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా 15 రోజులపాటు జరిగే గుర్రం జాషువా జయంతోత్సవాలను ఆదివారం శ్రీవిజ్ఞానవేదిక పర్యవేక్షణలో భీమవరం జిల్లా శాఖ గ్రంథాలయంలో గుర్రం జాషువా జయంతోత్సవాలను ఎమ్మెల్యే అంజిబాబు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. సాహితీ నందనవనం భీమవరమని, ఎందరో కవులు, కళాకారులు క్రీడాకారులు విశిష్ట సేవలందించి భీమవరం ఖ్యాతిని దేశంలో యినుమడింప చేసారని, గుర్రం జాషువా రచనలు మానవతా విలువల్ పెంచేలా ఉంటాయన్నారు. తన సాహిత్యంతో సమాజంలో ఎన్నో మార్పులు తీసుకొచ్చారని, కలాన్ని ఆయుధంగా మలచుకొని కుల వివక్షపై కవితా స్త్రాలను సంధించిన మహావ్యక్తి గుర్రం జాషువా అని ఎమ్మెల్యే అంజిబాబు అన్నారు. 15 రోజులపాటు రాష్ట్ర వ్యాప్తంగా గుర్రం జాషువా జయంతోత్సవాలను నిర్వహించడం హర్షించదగ్గ విషయమ న్నారు. ఫౌండేషన్ అధ్యక్షురాలు రచయిత దానశి ఉషారాణి, సీఈవో ఎం.రత్నం,ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు పులఖండం కోటేశ్వరరావు, రచయితలు కలిగొట్ల గోపాల శర్మ, దాయనా చంద్రజీ మాట్లాడుతూ సమసమాజ నిర్మాణ స్ఫూర్తి ప్రదాత గుర్రం జాషువా అని అన్నారు. కార్యక్రమ కన్వీనర్ చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ సంఘ సంస్కరణే లక్ష్యంగా సాహిత్యాన్ని సృష్టించిన జాషువా తెలుగు సాహితీ లోకంలో దిగ్గజ వ్యక్తిగా నిలిచారని అన్నారు. కార్యక్రమంలో అల్లూరి సీతారామరాజు యువజన సంఘాల జిల్లా సమాఖ్య అధ్యక్షుడు కంతేటి వెంకటరాజు, అరసవల్లి సుబ్రహ్మణ్యం, గ్రంథాలయ అధికారి ఎస్ వెంకటేశ్వరరావు, శిరీష, మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ షబీనా బేగం, భట్టిప్రోలు శ్రీనివాసరావు, పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

## కృషి పట్టుదలే శ్యామ్ విజయాలు

మొదటిపేజీ తరువాయి

విజయం సాధించి ఉద్యోగం పొందిన విద్యార్థులందరికీ ప్రత్యేకంగా సన్మానము వారి తల్లిదండ్రులకు అభినందనల కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. శ్యామ్ 25 ఏళ్ల తన సంస్థ పనితీరు విజయాలను వివరించారు. ఎంతోమందికి ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉద్యోగం కల్పించాలని వారి జీవితాన్ని ఉన్నత స్థాయిలో చేర్చాలనే లక్ష్యంతో ఈ శ్యామ్ ఇన్స్టిట్యూట్ ఏర్పాటు చేశామన్నారు. చిన్న ప్రదేశంలో ఏర్పాటు అయినా తమ సంస్థ అంచెలంచెలుగా ఎదిగి నేడు పెద్ద సంస్థగా మారిందన్నారు. ఈ తమ సంస్థ ఉన్నత స్థితికి చేరడంలో అధ్యాపకులు, మిత్రులు, శ్రేయోభిలాషుల సహకారం మరువలేనిదని శ్యామ్ చెప్పారు. ఈ సందర్భంగా ఉద్యోగం సాధించిన విద్యార్థులు అందరికీ ప్రత్యేక అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఆంధ్ర తెలంగాణలో మొదటి స్థానం సాధించిన విశాఖ జిల్లా అచ్యుతాపురం దొప్పెర్ల గ్రామానికి చెందిన జి.నానాజీని, మొదటి స్థానం పొందిన యువతుల్లో విజయనగరం జిల్లా గడసరి గ్రామానికి చెందిన జి.రమ్య మాధురి, అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండలం గుడివడక గ్రామానికి చెందిన ఏపీఎస్సీ స్టేట్ టాపర్ ఎం.అచ్యుతరావులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము చాలా పేద కుటుంబానికి చెందినవారమే కాక తమ కుటుంబాలు ఒక్కొక్కసారి తిండి దొరకని పరిస్థితుల్లో కూడా పస్తులు ఉన్న సంగతులను గుర్తు చేశారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరు తమలాగే రాణించాలని వారు సూచించారు.ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ఆలీ, మదీనా, శేఖర్, గోవర్ధన్, శ్రీనివాస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రాణాలపై ఆశ వదులుకున్న.. మంత్రి సుభాష్ ప్రాణభిక్ష పెట్టారు

మొదటిపేజీ తరువాయి

మాట్లాడుతూ పేదరికం కారణంగా, మెరుగైన వైద్యం పొందలేక ప్రాణాలపై ఆశలు వదులుకున్నానని, మంత్రి సుభాష్ రూపంలో.. ముఖ్యమంత్రి సహాయ నిధిద్వారా ఎల్‌ఓసి పొందటంపట్లజీవితంపై ఆశ చిగురించిందని ఆనంద భాష్పాలుతో తెలిపాడు.బాధితుడు తిరుపతి రావు మోములో ఆనందం చూసిన స్థానిక ప్రజలు, కూటమి పార్టీ నాయకులు,ఆయన కుటుంబ సభ్యులు మంత్రి సుభాష్ కు కృతజ్ఞతలు తెలిపారు. నిరుపేదల పట్ల, రోగుల పట్ల మానవతా దృక్పథంతో ప్రభుత్వ పరంగాను, వ్యక్తిగతంగాను నియోజకవర్గ ప్రజలకు అండగా నిలుస్తున్న మంత్రి సుభాష్ సేవా నిరతిని ప్రజలు కీర్తిస్తున్నారు.

## రైతులకు మెరుగైన సేవలు అందించాలి : ఎమ్మెల్యే పితాని

**అట్టహాసంగా ఇలపర్రు సొసైటీ ప్రమాణ స్వీకారం**



**పెనుగొండ,మేజర్ న్యూస్:** పెనుగొండ మండలంలోని ఇలపర్రు సొసైటీ త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం అట్టహాసంగా జరిగింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పితాని సత్య నారాయణ ముఖ్య అతిథిగా హాజరై కొత్త పాలకవర్గానికి శు భాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో కేతా సత్యనారాయణ (సత్తిబాబు) అధ్యక్షుడిగా, చేకూరి నరసింహారాజు, నల్లి త్రిమూర్తులు సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సొసైటీ ద్వారా నూతన పాలకవర్గం రైతులకు మెరుగైన సేవలు అందించాలని, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ కేతా సత్యనారాయణ (సత్తిబాబు) మాట్లాడుతూ రైతు సంక్షేమమే మా ప్రధాన ధ్యేయం. సొసైటీ ద్వారా ఎరువులు, విత్తనాలు, పంట రుణాలు సమయానికి అందేలా కృషి చేస్తాం. రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు వినిపించి పరిష్కారం చూపే దిశగా అడుగులు వేస్తాం. ఎవరైనా రాజకీయాలకు అతీతంగా అందరి సహకారంతో ముందుకు సాగుతాం" అని అన్నారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ మండల,గ్రామ అధ్యక్షులు, కూటమి ముఖ్య నాయకులు పాల్గొని కొత్త కమిటీకి అభినందనలు తెలిపారు.

# ఆదిత్య విద్యార్థినుల సేవా కార్యక్రమం






**కాకినాడ, మేజర్ న్యూస్ :** స్థానిక సాంబమూర్తి నగర్‌లో గల ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్లు స్థానిక సాంబమూర్తి నగర్ 4వ వీధి నందు గల పార్క్‌లో స్వచ్ఛతా కార్యక్రమం చేపట్టినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె.కరుణ తెలిపారు.

ఈ సందర్భంగా ఆదిత్య డిగ్రీ మరియు పి.జి. కళాశాల అకడమిక్ డైరెక్టర్ డా॥ బి.యి.వి.యల్ నాయుడు మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత ఆరోగ్యానికి భద్రత అని అన్నారు. ప్రతీ ఆదివారం మహిళా కళాశాల విద్యార్థినులు సమాజం కోసం సమయాన్ని కేటాయించి సేవలు చేయడం అభినందనీయం అని అన్నారు. ఆదిత్య మహిళ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.కరుణ మాట్లాడుతూ మన కళాశాలకు చెందిన ఎన్.ఎస్.ఎస్. బృందం చేపట్టిన స్వచ్ఛతా కార్యక్రమంలో ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్లు చురుగ్గా పాల్గొని పార్క్ నందు గల వ్యర్థాలను, పొడి చెత్తను శుభ్రపరచినట్లుగా ఆమె తెలిపారు. పబ్లిక్ పార్క్‌ల పరిసరాల పరిశుభ్రత విద్యార్థి దశ నుంచే అలవరచు కుంటున్న ఎన్.ఎస్.ఎస్.వాలంటీర్లను ఆమె అభినందించారు.

ప్రతీ ఒక్కరికీ తడి చెత్త, పొడి చెత్త హానికర వ్యర్థాలను గుర్తించి విభజన చేయడం మీద అవగాహన కలిగి ఉండాలని, అన్ని వ్యర్థాలను ఆహార పదార్థాలతో కలిపి పారవేయడం వల్ల పశువులు వాటిని తిని ప్రమాదానికి గురౌతున్నాయి అని ఆమె అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రాం ఆఫీసర్స్ పి.బి.టి.సురేఖ దేవి, ఫిజికల్ డైరెక్టర్ ఎన్.సత్యవతి మరియు ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్లు పాల్గొన్నారు.

## సమాజ సేవలో వాసవి క్లబ్ సేవలు స్ఫూర్తిదాయకం

-సీనియర్ పాత్రికేయుడు నాగిరెడ్డికి ఘన సన్మానం




**అనపర్తి, మేజర్ న్యూస్ :** సమాజహితం కోరుతూ, అనేక మంచి సంక్షేమ కార్యక్రమాలను చేపడుతూ, పేద ప్రజలకు సాయం చేస్తూ మానవ సేవే మాధవ సేవగా వాసవి ఆదర్శ క్లబ్ చేస్తున్న సేవ కార్యక్రమాలు స్ఫూర్తిదాయకమని ప్రముఖ దస్తావేజుల లేఖరి, సీనియర్ పాత్రికేయులు కర్రి నాగేశ్వరరెడ్డి అన్నారు. అనపర్తి చెందిన వాసవి ఆదర్శ క్లబ్ ఆధ్వర్యంలో వాసవి వారోత్సవాల్లో భాగంగా సీనియర్ పాత్రికేయులకు ఆదివారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. వాసవి ఆదర్శ క్లబ్ అనపర్తి శాఖ అధ్యక్షురాలు మన్యం పద్మావతి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు వక్తలు మాట్లాడుతూ, సమాజ అభివృద్ధిలో మీడియా పాత్ర చాల కీలకమని, ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ సమాజ శ్రేయష్షుకు కృషి చేస్తున్న పాత్రికేయులకు అభినందనలు తెలిపారు. అనంతరం కర్రి నాగేశ్వరరెడ్డి ని దుశ్శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు చెక్కా గౌరీ, చెక్కా సునీత, వెత్సా రత్నకుమారి, గ్రంధి సుజాత, కంచర్ల శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

## ఛండీహోమంలో పాల్గొన్న భక్తులు



పెద్దాపురం, మేజర్ న్యూస్ : పెద్దాపురం పట్టణంలో వేంచేసియున్న శ్రీశ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారి దేవస్థానం నందు ఆదివారం ఉదయం ఆలయ అసిస్టెంట్ కమీషనర్ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో వేదపండితులు మరిడమ్మ అమ్మవార్కి పౌర్ణమి సందర్భంగా ఛండీహోమం నిర్వహించారు.

అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వేదపండితులు ఐ.వి.ప్రసాదశర్మ, ఎన్.వి.శాస్త్రి, శంకర శాస్త్రి, ఆసాదులు రాయ రామచంద్రప్రసాద్ (నాని), రాయ విజయ్‌కుమార్, సిబ్బంది వెంకటరమణ, క్రాంతివీర్ గౌరి, వరహాలు, లోవ, శివ తదితరులు పాల్గొన్నారు.

# రూ.3 కోట్ల 60 లక్షలతో సీసీ డ్రైనేజీ నిర్మాణం

– ఐటీడీఏ పివో కట్టా సింహాచలం వెల్లడి



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** రంపచోడవరం గ్రామ పంచాయితీ పరిధిలో ప్రధాన రహదారుల్లో సీసీ డ్రైనేజ్ ఏర్పాటు చేయడానికి రూ.3 కోట్ల 60 లక్షలు మంజూరు చేయడం జరిగిందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం పేర్కొన్నారు. రంపచోడవరం గ్రామంలో మారేడుమిల్లి వైపు రహదారి నుండి అంబేద్కర్ సెంటర్, సబ్ కలెక్టర్ కార్యాలయం మీదుగా సీసీ డ్రైనేజ్ ఏర్పాటు చేయుటకు మూడు కోట్ల 60 లక్షల రూపాయలు మంజూరు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. అదేవిధంగా డ్రైనేజీ ఏర్పాటు చేసిన తర్వాత డ్రైనేజీ సమస్య ఉండదని ఆయన తెలిపారు. అదేవిధంగా రంపచోడవరం గ్రామంలో రోడ్డు వెడల్పులో షాపులు కోల్పోయిన గిరిజనులకు షాపులు ఏర్పాటు చేసే విధంగా ఉన్నతాధికారులతో సంప్రదించడం జరిగిందని, ప్రతిపాదనలు పరిశీలనలో ఉన్నాయని ఆయన తెలిపారు. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన రైతులకు స్పెషల్ మైనర్ ఇరిగేషన్ ద్వారా ఇప్పటికే 4,600 ఎకరాలకు సాగునీరు అందించుటకు 11 పనులు మంజూరు చేయడం జరిగిందన్నారు. అందులో ఎనిమిది పనులు ఇప్పటికే పూర్తి చేయబడి 3,500 ఎకరాలకు సాగునీరు అందించడం జరిగుతుందన్నారు. మిగతా మూడు పనులు 1100 ఎకరాలకు సంబంధించి ఒక వారం రోజులు లోపు పనులు పూర్తి చేస్తారన్నారు. అంతేకాకుండా మరో 6,640 ఎకరాలకు సాగునీరు అందించే విధంగా రూ.3.90 కోట్లుతో 18 పనులు మంజూరు కోసం ప్రతిపాదనలు పంపించడం జరిగిందన్నారు.

## జిల్లాలో ప్రశాంతంగా ఫారెస్ట్ రిక్రూట్మెంట్ పరీక్షలు

– డీఆర్వో వెంకటరావు



**కాకినాడ, మేజర్ న్యూస్ :** ఆదివారం కాకినాడ జిల్లాలో నిర్వహించిన ఫారెస్ట్ రిక్రూట్మెంట్ ఆఫీసర్ల పరీక్ష ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించడం జరిగిందని జిల్లా రెవెన్యూ అధికారి, పరీక్షలు కన్వీనర్ జె.వెంకటరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఫారెస్ట్ రిక్రూట్మెంట్ పరీక్షలకు కాకినాడ జిల్లావ్యాప్తంగా 26 కేంద్రాల్లో 18వేల మంది అభ్యర్థులకుగాను 15,153 మంది అభ్యర్థులు హాజరయ్యారన్నారు. ఆదివారం ఉదయం పూట జరిగిన ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ల పరీక్షలకు 15,447 మంది అభ్యర్థులకు 13,330 మంది హాజరయ్యారని ఆయన తెలిపారు. అదేవిధంగా మధ్యాహ్నం జరిగిన ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ పరీక్షకు 2283 మంది అభ్యర్థులకు గాను 1823 మంది హాజరయ్యారని డీఆర్వో వెంకటరావు తెలిపారు.

## 8వ తేదీన కాకినాడలో యధావిధిగా పీజీఆర్ఎస్ కార్యక్రమం

– జిల్లా కలెక్టర్ షణ్మోహన్



**కాకినాడ, మేజర్ న్యూస్ :** ప్రజా సమస్యల పరిష్కారం నిమిత్తం ఏర్పాటు చేయబడిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) కార్యక్రమం జిల్లా స్థాయిలో సెప్టెంబర్ 8వ తేదీన సోమవారం కాకినాడ కలెక్టరేట్ గ్రీవెన్స్ హాలులో ఉదయం 10:00 గంటల నుంచి 01:00 గంట వరకు నిర్వహించడం జరుగుతుందని కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి అదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు అందరూ విధిగా హాజరు కావాలని ఆయన ఆదేశించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమానికి రాలేని అర్జీదారులు, వారి యొక్క అర్జీలను మీకోసం.ఎపి.జివోవి.ఇన్. వెబ్సైట్ నందు నమోదు చేసుకోవచ్చునని కలెక్టర్ తెలిపారు. అర్జీదార్లు వారి యొక్క అర్జీల యొక్క స్థితి తెలుసుకునేందుకు 1100కి నేరుగా కాల్ చేయవచ్చని కాకినాడ జిల్లా కలెక్టర్ తెలిపారు.

## అమ్మ సీతమ్మ సేవా సమితి ఆర్థిక సహాయం అందజేత



**రావులపాలెం, మేజర్ న్యూస్ :** రావులపాలెం గ్రామానికి చెందిన పూరి సరస్వతి షుగర్ వ్యాధితో నడవలేని స్థితిలో తీవ్రంగా బాధపడడం, ఆర్దిక లేమితో కొట్టుమిట్టలాడడం తన భర్త జనసరి కూలీగా పని చేస్తూ వైద్యం చేయించలేని పరిస్థితిలో ఉన్న అమ్మ సీతమ్మ సేవా సంస్థ సభ్యులను హార్దిక సహకార కోరగా ఆదివారం సంస్థ సభ్యులు సానబోయిన బాలాజీ ఆధ్వర్యంలో వారు గృహం వద్దకు వెళ్లి 5000 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో పాశం చింతరావ్ యాదవ్, సానబోయిన బుజ్జి, శ్రీకాంత్, రామకృష్ణ, మోటూరు శీను, పితాని శివ తదితరులు పాల్గొన్నారు.

# భూ కుంభకోణం అవినీతిలో దోషులపై చర్యలేవి?

**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** పోలవరం ప్రాజెక్టు భూ కుంభకోణం అవినీతిలో దోషులపై ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదని జిల్లా ఆదివాసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు వెదుళ్ళ లచ్చిరెడ్డి ఆదివారం ఆరోపించారు.



పోలవరం ముంపు గిరిజన కుటుంబాలను మోసం చేసి జైలుకెళ్ళి మూడున్నర సంవత్సరాలు గడుస్తున్నా వారిపై చార్జి షీటు వేయలేదన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా దేవీపట్నం మండలం పోలవరం ముంపులో గిరిజన భూములకు దొంగ పట్టాలు సృష్టించి జైలుకెళ్లిన దళారులు, ప్రభుత్వ అధికారులపై ఇంతవరకు ఎందుకు చార్జిషీట్ వెయ్యలేదని ప్రశ్నించారు. అప్పటి ఏఎస్పీ కృష్ణ కాంత్ పటేల్ రెవెన్యూ సిబ్బంది సమక్షంలో ఇన్వెస్టిగేషన్ రిపోర్ట్ చార్జిషీటులో పొందుపరచాలన్నారు. అలాగే డి.పట్టాలు ఫోరెన్సిక్ ల్యాబ్ రిపోర్ట్ పొందుపరచాలన్నారు. బ్యాంకు లావాదేవీలు రిపోర్టు పొందుపరచాలని, అప్పటి రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ ఇన్వెస్టిగేషన్ రిపోర్ట్ (సిసి టీవీ) పర్యవేక్షణలో జరిగిన రిపోర్టు తప్పనిసరిగా పొందుపరచాలని డిమాండ్ చేసారు. దేవీపట్నం ఎమ్మార్వో విచారణ రిపోర్టు పొందుపరచాలని, అప్పటి ఎమ్మార్వో ఇచ్చిన డ్యూటీ సర్టిఫికెట్స్ పొందుపరచాలని, అప్పటి కలెక్టర్ సుమిత్ కుమార్, పోలవరం ప్రాజెక్ట్ అడ్మినిస్ట్రేటర్ ప్రవీణ్ ఆదిత్య పేర్లు నమోదుతో తీసుకున్న చర్యలపై రంపచోడవరం ఏఎస్పీకి పంపిన ఆర్డర్ కాపీ పొందుపరచాలన్నారు. అప్పటి పోలీసు విచారణలో దళారుల ఇళ్ల వద్ద బయటపడ్డ రెవెన్యూ రికార్డులు, స్టాంపులు పొందుపరచాలన్నారు. పోలవరం ముంపులో గిరిజన భూములకు పట్టాలు సృష్టించి జైలు కెళ్లిన దళారులు, ప్రభుత్వ అధికారులపై ఇంతవరకు ఎందుకు చార్జిషీట్ వేయలేదో చెప్పాలన్నారు. అప్పటి జిల్లా కలెక్టర్ సుమంత్ కుమార్, అప్పటి పోలవరం ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ ప్రవీణ్ ఆదిత్య జాయింట్ ఆపరేషన్‌పై అప్పటి అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ కృష్ణకాంత్ పటేల్ ఇంటరాగేషన్ నిమిత్తం 50శాతం నిజాలు రాబట్టారు కానీ, దళారులలో ముఖ్య సూత్రధారులైన దండంగి, దేవారం గ్రామాలకు సంబంధించిన వ్యక్తులు ఇళ్లలో సోదాలు చేయగా ముఖ్యంగా రెవెన్యూ రికార్డులు, కొన్ని స్టాంపులు పోలీసులు స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో పోలీసు, రెవెన్యూ అధికారులు కొంతమంది భారీగా ముడుపులు తీసుకున్నారని, కర్త, క్రియ, కర్మగా వ్యవహరించిన దండంగి గ్రామానికి చెందిన ఆదర్శ రైతు దగ్గర అప్పటి పోలీస్ ఇంటరాగేషన్లో భారీగా ముడుపులు తీసుకుని స్టేషన్ బెయిల్ పై వదిలిపెట్టారన్నారు. దోషులపై తప్పకుండా క్రిమినల్ చర్య తీసుకోవాలని, గుబ్బలంపాలెం భూకుంభకోణంలో పోలవరం ముంపులో 44 గ్రామాల గిరిజన కుటుంబాలకు సంబంధించి విచారణకు ఈడి, సిబిఐ కి ప్రభుత్వం రాయడం జరిగిందన్నారు. తొందరగా విచారణ చేస్తే మద్యం కుంభకోణంలో బయటపడ్డ ముడుపులు కన్నా పోలవరం ప్రాజెక్టు భూ కుంభకోణం అవినీతి చాలా ఎక్కువగా ఆశ్చర్యపోయే విషయాలు బయటపడతాయని జిల్లా ఆదివాసి సంక్షేమ సంఘం అధ్యక్షులు పేర్కొన్నారు. ఈ విషయాలపై ఏ చర్చకు పిలిచినా తాము సిద్ధంగా ఉన్నామని, అవసరమైతే ఐటిడిఏ కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఆదివాసీ సంఘం అధ్యక్షులు వెదుళ్ళ లచ్చిరెడ్డి తెలియజేశారు.

# 21,500 వేల మెట్రిక్ టన్నుల యూరియా రైతులకు అందించాం

**- రైతుల సమస్యలు 8977935611 నెంబర్ కు తెలియ చెయండి**
**- జాయింట్ కలెక్టర్ వై. మేఘ స్వరూప్**

**నరేంద్రపురం, మేజర్ న్యూస్ :** రబీ సీజన్ కోసంగత ఏడాది సెప్టెంబర్ చివరి నాటికి 19 వేల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా జరిగిందని , 2025లో ఇప్పటికీ రైతులకు 21,500 వేల మెట్రిక్ టన్నులు అందించామని జాయింట్ కలెక్టర్ వై. మేఘ స్వరూప్ తెలిపారు. ఆదివారం రాజానగరం మండలం నరేంద్రపురం రైతు సేవా కేంద్రంలో రైతులతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ – జిల్లాలో "ఇంకా సుమారు 2 వేల మెట్రిక్ టన్నుల యూరియా అదనంగా నిల్వలో ఉంది. కాబట్టి రైతులు ఎలాంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదు. జిల్లా స్థాయిలో తనిఖీలు నిర్వహించినప్పుడు రైతులు సరఫరాపై సంతృప్తి వ్యక్తం చేశారు" అని వివరించారు. ఎవరైనా ఇబ్బందులు ఎదుర్కొన్నా, రైతుల సమస్యలు తెలియజేయడానికి సంప్రదించవలసిన నెంబర్: 8977935611 అని సూచించారు.జిల్లా వ్యవసాయ శాఖ, సహకార విభాగం సమన్వయంతో రైతులకు ఎమ్.ఆర్.పీ. ధరలకు యూరియా



అందిస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎస్ మాధవ రావు, ఎన్ ఎఫ్ ఓ తాతారావు , వ్యవసాయ, సహకార అధికారులు, రైతు సేవా కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

# అభివృద్ధి, సంక్షేమం నిరంతర ప్రక్రియ

**- రూ.19 లక్షలతో నిర్మించిన సిసి రోడ్లు ప్రారంభించిన మంత్రి సుభాష్**



**కె గంగవరం, మేజర్ న్యూస్ :**రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, అన్ని గ్రామాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు సమకూరుస్తామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. కె గంగవరం మండలం దంగేరు గ్రామంలో రూ.19 లక్షల రూపాయలతో నిర్మించిన నాలుగు సిమెంట్ రోడ్లను మంత్రి సుభాష్, స్థానిక కూటమి పార్టీ నాయకులతో కలిసి ప్రారంభించారు. తొలుత రావిపాటి వెంకట గణేష్ చౌదరి ఇంటి వద్ద నుంచి నిర్మించిన రోడ్డు రూ. 8 లక్షలు, దొమ్మేటి రాముడు ఇంటి నుంచి రూ. 5.3 లక్షలతోనూ, సూరవరపు సూర్యనారాయణ ఇంటి వద్ద నుంచి ప్రారంభమైన రోడ్డుకు రూ.2.70 లక్షలు, సత్తి సత్యనారాయణ ఇంటి వద్ద నుంచి ప్రారంభమైన రోడ్డు 3 లక్షలు మొత్తం రూ. 19 లక్షలు వెచ్చించి నిర్మించారు. ఎంజిఎన్ఆర్ఇజిఎస్ పథకం నిధులతో ఈ రోడ్ల నిర్మాణం చేశారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ రామచంద్రపురం నియోజవర్గంలోని అన్ని గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడం ద్వారా ఆయా గ్రామాలను సుందరీ కరిస్తామన్నారు. గడిచిన ఏడాది కాలంలో రామచంద్రపురం నియోజవర్గంలో రూ.125 కోట్లు నిధులుతో అభివృద్ధి చేశామన్నారు. భవిష్యత్తు కాలంలో పెద్ద ఎత్తున అభివృద్ధి, సంక్షేమం చేపట్టి ప్రజల కనీస అవసరాలు పూర్తిస్థాయిలో తీరుస్తామన్నారు. గ్రామాలు బాగుంటేనే రాష్ట్రం కూడా శోభాయమానంగా ఉంటుందన్నారు. అభివృద్ధి నిరంతర ప్రక్రియగా తన ప్రభుత్వం కొనసాగిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి సుభాష్ వెంట తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు మేడిశెట్టి రవికుమార్, నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు శివ ప్రసాద్, కూటమి పార్టీ నాయకులు వెంకట గణేష్ చౌదరి, సర్పంచ్ కొప్పిశెట్టి వెంకటరమణ, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అన్నదాన భవన నిర్మాణానికి రూ.లక్ష విరాళం



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వర స్వామివారి వకుళ మాత అన్నదాన భవన నిర్మాణానికి ఆదివారం కృష్ణ జిల్లా, కంకిపాడుకు చెందిన పోపూరి కృష్ణారావు, ఝాన్సీ రాణి దంపతులు రూ.1,01,116లు విరాళంగా అందించారు. వీరికి ఆలయ అర్చకులు ఆలయం మర్యాదలతో స్వాగతం పలికి స్వామి చరిత్ర గురించి వివరించారు. ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధర్ రావు, సిబ్బంది స్వామివారి చిత్రపటం అందించారు.

## రావులపాలెం ఎంపీడీవో మహేశ్వరరావుకు ఎపిడిగా పదోన్నతి



**రావులపాలెం, మేజర్ న్యూస్ :** రావులపాలెం మండల పరిషత్తు ఎంపీడీవోగా పనిచేస్తున్న ఇ.మహేశ్వం రావుకు ఎపీడిగా (డిఎల్‌డివొ కేడర్) పదోన్నతి వచ్చింది. ఆయన్ని పి.గన్నవరం డివిజన్ డ్వామా ఏపీడిగా నియమిస్తూ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరీ శశిభూషణ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేసారు. ఈయన కొత్తపేట, కడియం, కోరుకొండ తదితరు మండలాల్లో ఎంపీడీవోగా విశేష సేవలందించారు. పదోన్నతి పొందిన ఎంపీడీవో మహేశ్వర రావును పలువురు అభినందించారు.

## చంద్రగ్రహణం సందర్భంగా శ్రీశృంగార వల్లభ స్వామి దేవస్థానం మూసివేత



పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ : పెద్దాపురం మండలం, తొలి తిరుపతి గ్రామంలో వేంచేసియున్న శ్రీశ్రీశ్రీ శృంగార వల్లభ స్వామి దేవస్థానంను చంద్రగ్రహాణం సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం 12.30 గంటలకు మూసివేసినట్లు ఇఓ వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన తెలుపుతూ సంప్రోక్షణ అనంతరం సోమవారం ఉదయం 9 గంటలకు భక్తులకు స్వామివారి దర్శనం కల్పించబడునని, కావున భక్తులు గ్రహించగలరని ఆయన కోరారు.

## పరిక్షా కేంద్రంను పరిశీలించిన ఆర్డీఓ కె.శ్రీరమణి



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** ఆదివారం పెద్దాపురం మండలం, దివిలి–తిరుపతి గ్రామంలో గల కిట్స్ ఇంజనీరింగ్ విద్యా సంస్థలో జరుగుతున్న ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ మరియు అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ పరిక్షల నిర్వహణను ఆర్డీఓ కె.శ్రీరమణి పరిశీలించారు. ఆమె వెంట పెద్దాపురం తహశీల్దార్ సిహెచ్.వెంకట లక్ష్మి, పలువురు రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు. దీనిలో భాగంగా పరీక్షల నిర్వహణ, జరుగుతున్న విధానాన్ని పరిశీలించి, పరీక్షా కేంద్రంలో అవసరమైన సౌకర్యాలను పరిశీలించి, సిబ్బందికి తగు సూచనలు చేశారు.

# ఎల్ఐసి పాలసీలపై జిఎస్టి తొలగింపు..

# ఎల్ఐసి ఏఓఐ పోరాట ఫలితం

**– ఏవోఐ ఆధ్వర్యంలో గల్లీ నుండి ఢిల్లీ దాకా చేసిన పోరాటాలలో పాల్గొన్న ప్రతి ఒక్క ఎల్ఐసి ఏజెంట్ కు ధన్యవాదాలు**

**– ఈ జీఎస్టీ వ్యతిరేక పోరాటంలో మద్దతిచ్చిన అన్ని పార్టీలు ఎంపీలకు కేంద్రమంత్రి నితిన్ ఘట్కరికి ధన్యవాదాలు**

**– ఎల్ఐసి ఏఓఐ రాజమండ్రి డివిజన్ కౌన్సిల్ సమావేశంలో కేకు కట్ చేసి సంబరాలు**



**పెరవలి, మేజర్ న్యూస్ :** ఎల్ఐసి ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా పోరాటాల ఫలితంగా ఎల్ఐసి పాలసీలపై జిఎస్టి తగ్గించాలని నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకుందని ఎల్ఐసి ఏవోఐ తణుకు బ్రాంచ్ అధ్యక్షులు సలాది ఉదయభాస్కరరావు అన్నారు. సెప్టెంబర్ 7వ తేదీ ఆదివారం మేజర్ న్యూస్ తో మాట్లాడుతూ 2017 జులై 1 వ తేదీ నుండి ఎల్ఐసి పాలసీ ప్రీమియంలపై అమలవుతున్న ఈ జీఎస్టీ తగ్గించాలని గల్లీల నుండి ఢిల్లీ దాకా ఎల్ఐసి ఏవోఐ చేసిన పోరాట ఫలితమే ఈ జీఎస్టీ తగ్గింపు అని వారన్నారు. జిఎస్టి తగ్గింపు పేద మధ్యతరగతి వారికి చిన్న పాలసీదారులకు ఎంతో ఉపశమనం కలిగిస్తుందని వారు అన్నారు. ఈ జీఎస్టీ తగ్గింపు సెప్టెంబర్ 22వ తేదీ నుండి వర్తిస్తుందని వారు అన్నారు.జిఎస్టిని కేంద్ర ప్రభుత్వం తీసివేసిన సందర్భంలో లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసి ఏవోఐ) ఆధ్వర్యంలో ఆనందోత్సవాల మధ్య కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎల్ఐసి ఏవోఐ జోనల్ జనరల్ సెక్రెటరీ పి ఎల్ నరసింహారావు, రాజమండ్రి డివిజన్ ఏఓఐ అధ్యక్షుడు విశ్వేశ్వరరావు మరియు రాజమండ్రి డివిజన్ లోని అన్ని బ్రాంచీల ఎల్ఐసి ఏఓఐ అధ్యక్ష కార్యదర్శుల ఆధ్వర్యంలో సెప్టెంబర్ ఆరో తేదీ శనివారం కొవ్వూరులో డివిజన్ స్థాయి సమావేశం ఏర్పాటు చేసి విజయోత్సవ సభ నిర్వహించాము అన్నారు. కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ విధానాన్ని తీసుకురావడం వల్ల సాధారణ పాలసీలపై 4.5%, 2.5%, హెల్త్ పాలసీల పై 18%, టెర్మ పాలసీలపై 18% జిఎస్టిని వసూలు చేస్తున్నారని ఇది పాలసీదారులకు అందరికీ భారంగా ఉండటం పాలసీల అమ్మకాలకు ప్రతిబంధకంగా మారడంతో ఎల్ఐసి ఏవోఐ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా అన్ని ఎల్ఐసి బ్రాంచ్ కార్యాలయాలు వద్ద ధర్నాల నిర్వహించిందని తదుపరి హైదరాబాదులోని ఐఆర్డీఏ కార్యాలయం ముందు, ముంబైలో ఎల్ఐసి సెంట్రల్ ఆఫీస్ కార్యాలయం ముందు, ధర్నాలు చేసిందని ఫలితం కనిపించకపోవడంతో చలో పార్లమెంటు పిలుపునిచ్చి న్యూఢిల్లీలోని ధర్నా చౌక్ లో ధర్నాలు చేసి దేశవ్యాప్తంగా పార్లమెంటు సభ్యులకు వినతి పత్రాలు అందించిందని దాని ఫలితంగా వివిధ పార్టీలకు చెందిన పార్లమెంట్ సభ్యులు పార్లమెంట్లో ఎల్ఐసి ఏజెంట్ల సమస్యలను ప్రస్తావిస్తూ ఇన్సూరెన్స్ పాలసీలపై జిఎస్టి తీసివేయాలని కోరారు అని ఉదయభాస్కరరావు అన్నారు. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ కు ఎల్ఐసి స్టాఫ్ అసోసియేషన్తో కలిసి వినతిపత్రం అందించామని నితిన్ గడ్కరి చొరవతో అన్ని పార్టీలకు చెందిన పార్లమెంటు సభ్యుల చొరవతో కేంద్ర ప్రభుత్వం ఎట్టకేలకు జీఎస్టీ తీసివేయాలనే మంచి నిర్ణయాన్ని తీసుకుందని ఇది ఎల్ఐసి పాలసీదారులకు చాలా శుభ పరిణామం అని ఉదయ భాస్కరరావు అన్నారు.

## ఎరువుల బ్లాక్ మార్కెట్ - అన్నదాత పోరు పోస్టర్ ఆవిష్కరణ

– పోస్టర్ ఆవిష్కరించిన పిఠాపురం వైసిపి ఇన్చార్జ్ వంగా గీత విశ్వనాథ్



పిఠాపురం, మేజర్ న్యూస్ : వైఎస్ఆర్సిపి అధిష్టానం పిలుపుమేరకు ఎరువుల బ్లాక్ మార్కెట్ అన్నదాత పోరు అనే పోస్టర్ను పిఠాపురం వైఎస్ఆర్సిపి ఇన్చార్జ్ వంగా గీతా విశ్వనాథ్ ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయం వద్ద పార్టీ శ్రేణులతో కలిపి ఆవిష్కరించారు. ఈ సందర్భం గా వంగా గీతా విశ్వనాథ్ మాట్లాడుతూ... వేసిన పంటలకు సకాలంలో ఎరువులు అందక రాష్ట్రంలో రైతులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొం టున్నారని అన్నారు.

రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి పిలుపుమేరకు ఎరువుల కొరతతో అన్నదాతలు పడుతున్న అవస్థలపై, అన్నదాతలకు అండగా ఉండేం దుకు ఎరువులు బ్లాక్ మార్కెట్ – అన్నదాత పోరు అనే కార్యక్రమంలో భాగంగా ఈ నెల 9న రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# వైసిపీ రాష్ట్ర కార్యదర్శిగా ఒమ్మి రఘురామ్

**– ప్రత్తిపాడు, కాకినాడ రూరల్ పరిశీలకునిగా బాధ్యతలు**



**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** జగ్గంపేట నియోజకవర్గ వై సి పీ సీనియర్ నేత ఒమ్మి రఘురామ్ ని వై యస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గా నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటనలో తెలియజేసింది. రాష్ట్ర కార్యదర్శి బాధ్యతలతో పాటుగా ప్రత్తిపాడు నియోజకవర్గం, కాకినాడ రూరల్ నియోజకవర్గం పరిశీలకునిగా కూడా భాద్యతలు నిర్వర్తించాలని పేర్కొంది.ఒమ్మి రఘురామ్ గతంలో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సేవాదళ్ విభాగంలో ప్రధాన కార్యదర్శి గాను, అమలాపురం జిల్లా బూత్ కమిటీల అధ్యక్షుడిగాను, రామచంద్రాపురం, తుని నియోజకవర్గాల పరిశీలకునిగాను, కాకినాడ జిల్లా జెసియస్ కన్వీనర్గాను పని చేసి యున్నారు. ప్రస్తుతం కాకినాడ జిల్లా బూత్ కమిటీల అధ్యక్షునిగా కొనసాగుతున్నారు. రఘురామ్ శ్రీమతి ఒమ్మి బిందుమాధవి జగ్గంపేట మండల జడ్పీటీసీగా బాధ్యతలు నిర్వరి స్తున్నారు. రఘురామ్ పార్టీ ఆవిర్భావం నుండి నిబద్ధతతో పనిచేస్తూ, జగ్గంపేట నియోజకవర్గంలో ఎప్పుడు పార్టీ కష్ట కాలంలో ఉన్నా పార్టీకి, కేడర్కి అండగా ఉంటూ కార్యక్రమాలు చేయడం పార్టీ పట్ల ఆయనకున్న నిబద్ధతకు నిదర్శనంగా చెప్పొచ్చు. పార్టీ అధికారంలోకి వచ్చినా రఘురా మ్కి అధికారికంగా ఏ పదవి ఇవ్వకపోయినా పార్టీకి పనిచేస్తూనే ఉండడం జగన్మోహన్ రెడ్డి పట్ల, పార్టీ పట్ల ఆయనకు ఉన్న నమ్మకంగా పేర్కొనొచ్చు,ఏబాధ్యత ఇచ్చినా ఆ భాధ్యతను పూర్తి స్థాయిలో నిర్వర్తిం చడం వలన రఘురామ్కి ఇన్ని రకాల పార్టీ బాధ్యతలు అప్పగించడం జరుగుతుందని భావించవచ్చు. ఈ సందర్భంగా రఘురామ్ని పలువురు నాయకులు, అభిమానులు అభినందించారు.పార్టీకి పనిచేస్తున్న రఘురామ్కి పార్టీ అధికారంలోకి వచ్చాక సముచిత స్థానం కల్పించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రఘురామ్ మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి నాపై నమ్మకంతో అప్పగించిన ఈ బాధ్యతలను శక్తి వంచన లేకుండా నిర్వర్తిస్తానని తెలియజేస్తూ. వైసిపి అధినేత జగన్ కి హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ భాద్యతలు రావడానికి సహకరించిన రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి, నియోజకవర్గ స్థాయి నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

## కబడ్డీ క్లబ్బుకు ఎన్నికైన జయరాజు



**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** రామవరం గ్రామానికి చెందిన అంబేద్కర్ యూత్ సభ్యుడు జయరాజు విశాఖపట్నం కబడ్డీ క్లబ్కి ఎంపిక చేయపడ్డారు. జయరాజు కబడ్డీ క్లబ్ కు ఎంపికైన సందర్భంగా జయరాజును గ్రామ పెద్దలు యూత్ సభ్యులు అభినం దనలు తెలిపారు. గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. యువతకు ఇటువంటి ప్రోత్సాహకాలు కల్పించడం వలన యువతలో మరింత ఉద్దేశం వచ్చి ఆటలలో తన సామర్థ్యాన్ని నిరూపించుకోగలుగుతారు. జయరాజు ఆటలో మరింత ప్రావీణ్యం సాధించి ఇంకా ఉన్నత స్థాయికి వెళ్లాలని గ్రామస్తులు దీవిస్తూ అభినందిస్తున్నారు.

## యూరియా కోసం రైతులు ఆందోళన చెందవద్దు

**– జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎన్. విజయకుమార్**



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** యూరియా కోసం రైతులు ఆందోళన చెందవద్దని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎన్. విజయకుమార్ అన్నారు. పిఠాపురం వ్యవసాయ శాఖ అధికారిణి పి. స్వాతి మరియు ఇతర సిబ్బందితో కలిసి పిఠాపురం మండలం విరవ గ్రామంలో పర్యటించి రైతులతో మాట్లాడారు. రైతులు యూరియా కోసం ఆందోళన చెందవద్దని, రైతు సేవా కేంద్రాలకు పిఠాపురం మండలానికి 80 మెట్రిక్ టన్నులు యూరియా వస్తుందని, రైతులకు ప్రత్యామ్నాయంగా జీవన ఎరువులు అయిన అజిటోబాక్టర్, అజోస్ పైరల్లం, నానో యూరియా ఉన్నాయని, ఎక్కువ యూరియా వాడకం వల్ల పురుగులు, తెగుళ్ల ఉధృతి పెరుగుతుందని, అందువల్ల మోతాదుకు మించి వాడవద్దని కోరారు. మూడవ కోటగా 10 నుంచి 15 కేజీల పొటాష్ వాడినచో మొక్కకు తెగులు, పురుగులు తట్టుకునే శక్తి మరియు గింజ నాణ్యత పెరుగుతుందన్నారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి గంగాధర్ మరియు వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## ఆదిత్య యూనివర్సిటీలో ప్రశాంతంగా ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ & అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ ఎగ్జామ్స్



**గండేపల్లి, మేజర్ న్యూస్ :** ఏ.పి.పి.ఎస్.సి. ఆధ్వర్యంలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ సెక్షన్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి నిర్వహించిన పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్లు ఆదిత్య యూనివర్శిటీ డిప్యూటీ ప్రో.ఛాన్సలర్ డా.మేడపాటి శ్రీనివాస రెడ్డి తెలియజేసారు. ఈ పరీక్షల నిర్వహణను పరిశీలించిన ఏ.పి.పి. ఎస్.సి. చైర్మన్ అనురాధ, పెద్దాపురం ఆర్.డి.ఓ. కె. శ్రీరమణి పరీక్షల నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఆదిత్య విశ్వవిద్యాలయం క్యాంపస్ నందు మొత్తం పది సెంటర్లలో 6648 మంది పరీక్షలు వ్రాయవలసి ఉండగా 5895 మంది హాజరయ్యారు. 753 మంది పరీక్షలకు గైర్హాజర్ అయినట్లు డా. శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పెద్దాపురం డి.ఎస్.పి. శ్రీహరి రాజు నేతృత్వంలో జగ్గంపేట సి.ఐ. వై.ఆర్.కె. శ్రీనివాస్, గండేపల్లి ఎస్. ఐ. శివ నాగబాబు, జగ్గంపేట ఎస్.ఐ. రఘునందన్ రావు, కిర్లంపూడి ఎస్.ఐ.సతీష్తో పాటు సుమారు 100 మంది పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. ఆదిత్య యాజమాన్యం అభ్యర్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేయడం పట్ల అధికారులు, అభ్యర్థులు సంతృప్తి వ్యక్తం చేశారు.

# యూరియా సరఫరా సజావుగా - రైతుల అవసరాలకు ప్రాధాన్యత

– క్షేత్ర స్థాయిలో అధికారులు పర్యటన



రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ : జిల్లాలో రైతులకు యూరియా ఎరువులు ఎటువంటి ఇబ్బంది లేకుండా సరఫరా అవుతున్నాయని ఆదివారం ఒక ప్రకటనలో జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి తెలిపారు. రైతుల అవసరాలను గుర్తించి, సకాలంలో ఎరువులు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

వ్యవసాయేతర వినియోగం లేకుండా, రైతుల సమస్యలు వెంటనే పరిష్కరించేందుకు జిల్లా యంత్రాంగం పర్యవేక్షణ చేస్తోందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎవరైనా ఇబ్బందులు ఎదుర్కొన్నా, రైతుల సమస్యలు తెలియ జేయడానికి సంప్రదించవలసిన నెంబర్: 8977935611 అని సూచించారు. యూరియా సరఫరా నేపథ్యంలో రైతులతో ముఖాముఖి సమావేశం నిర్వహించడం కోసం జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి పశివేదల, జాయింట్ కలెక్టర్ వై. మేఘ స్వరూప్ నరేంద్రపురం, ఇతర సమన్వయ శాఖల అధికారులు ఆర్డీవో, వ్యవసాయ, అనుబంధ శాఖల, రెవెన్యూ అధికారులు క్షేత్ర స్థాయిలో వివిధ సొసైటీలను, గోడౌన్‌లను సందర్శించడం, అక్కడి రికార్డులు పరిశీలించడం జరిగింది.

–యూరియా సరఫరా గణాంకాలు :–

కలెక్టర్ వివరాలు అందిస్తూ "ఖరీఫ్ 2024లో యూరియా వినియోగం మొత్తం 27,000 మెట్రిక్ టన్నులు, ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటివరకు 21,500 మెట్రిక్ టన్నులు రైతులకు సరఫరా అయ్యాయి. ఈరోజు మాత్రమే 511 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ చేయబడింది" అని తెలిపారు.

–రైతుల అభిప్రాయాలు

తాళ్లపూడి మండలం, పోచవరం గ్రామం – బొమ్మరాజు నాగేశ్వరరావు
"10 ఎకరాల్లో వరి పంట సాగు చేస్తున్నాను. సొసైటీ ద్వారా ఎటువంటి ఇబ్బంది లేకుండా యూరియా అందింది. పంట సిరికోత దశలో ఉండగా సకాలంలో ఎరువులు సరఫరా చేసినందుకు అధికారులకు, ప్రభుత్వానికి రైతుల తరపున కృతజ్ఞతలు"

కోరుకొండ మండలం, కాటా కోటేశ్వరం గ్రామం –ముంద్రు వీరభద్రరావు
"ఆరు ఎకరాల్లో వరి సాగు చేశాను. సీజన్ ప్రారంభంలో కొంత ఇబ్బంది ఎదురైనా, మండల వ్యవసాయ అధికారి చొరవతో 300 బస్తాల యూరియా సరఫరా చేయడంతో సమస్యలు తీరాయి. ప్రస్తుతం మరో 10 మెట్రిక్ టన్నుల యూరియా కూడా అందిస్తున్నారని అధికారులు తెలిపారు. ఎమ్.ఆర్.పీ. ధరలకే ఎరువులు అందించడం పట్ల ప్రభుత్వానికి కృతజ్ఞతలు"

–పసివేదల ప్యాక్ సొసైటీ సభ్యులు...
"మా పరిధిలో రైతుల అవసరాలకు అనుగుణంగా యూరియా సరఫరా జరిగింది. మిగిలిన అవసరాలు రెండు మూడు రోజుల్లో తీరుస్తామని అధికారులు హామీ ఇచ్చారు. కలెక్టర్ పి. ప్రశాంతి ముఖాముఖి సమయంలో మా సమస్యలను అడిగి తెలుసుకున్నారు, వాటిపై సానుకూలంగా స్పందించారు. నానో యూరియా వినియోగం, అంతర పంటలపై దృష్టి సారించాలని సూచించిన కలెక్టర్ మాటలు రైతులకు ప్రోత్సాహం కలిగించాయి"

– నిడదవోలు మండలం, పురుషోత్తమపల్లి గ్రామం – సిరివరపు కాశీ విశ్వనాథం
"7 ఎకరాల్లో వరి, 7 ఎకరాల్లో కోకో, 5 ఎకరాల్లో అరటి సాగు చేశాను. వరి పంటకు సంబంధించి యూరియా సరఫరాలో ఎటువంటి ఇబ్బంది లేదు. పురుషోత్తమపల్లి ఆధ్వర్యంలోని విజేశ్వరం, గోపారం, పురుషోత్తమపల్లి గ్రామాల్లో హార్టికల్చర్ పంటలు ఎక్కువగా సాగు చేస్తున్నారు. ఆ పంటలకు కూడా యూరియా సరఫరా చేయాలని రైతులు కోరుతున్నారు. వరి పంటకు సరిపడే యూరియా అందినందుకు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు"

రాజానగరం మండలం,తూర్పుగోనగూడెం– తోట వీరబాబు అభిప్రాయం వ్యక్తం చేస్తూ, "నేను ఆరు ఎకరాలు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాను. మా గ్రామానికి మూడు దఫాలుగా ఇప్పటివరకు 30 టన్నుల యూరియా సరఫరా చేశారు. ఇప్పటివరకు మా గ్రామంలో యూరియా కొరత లేదు. యూరియా బస్తా రూ. 266.50 పైసలకే అందుతోంది. అధికారులకు, ప్రభుత్వానికి ధన్యవాదాలు"

# రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత డా. సుబ్బారావుకు అభినందనల వెల్లువ







గండేపల్లి, మేజర్ న్యూస్ : సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ మెకానికల్ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్ గా సేవలందిస్తున్న డా. యర్రాప్రగడ కృష్ణ శ్రీనివాస సుబ్బారావు (వై.కె.ఎస్.సుబ్బారావు) కు రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించడం అభినందనీయం ఆనందదాయకం అని యూనివర్సిటీ ప్రో.ఛాన్సలర్ డా. నల్లమిల్లి సతీష్ రెడ్డి అన్నారు. సెప్టెంబర్ 5 ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు తమ ఆదిత్య యూనివర్సిటీలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా సేవలందిస్తున్న డా. సుబ్బారావు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర ఐ.టి. & విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా అవార్డు పొందడం గర్వకారణం అని డా. సతీష్ రెడ్డి అన్నారు. ఆదిత్య యూనివర్సిటీ ఛాన్సలర్ డా. నల్లమిల్లి శేషారెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి అత్యంత గౌరవ ప్రదమైన వృత్తి అని సమాజ నిర్మాణానికి ఉపాధ్యాయులు సారథులు అని ఆ వృత్తిలో గుర్తింపు రావడం అభినందనీయం అని ఉపాధ్యాయులకు అవార్డులు మరింత బాధ్యత పెంచుతాయని అన్నారు.

డిప్యూటీ ప్రో.ఛాన్సలర్ డా. ఎం.శ్రీనివాసరెడ్డి,వైస్ ఛాన్సలర్ ప్రో. ఎం.బి.శ్రీనివాస్,ప్రో. వైస్ ఛాన్సలర్లు డా. ఎస్. రమాశ్రీ,డా. ఏ. రమేష్, డా. రవి తంగంజం, రిజిస్ట్రార్ డా.జి.సురేష్ , ప్రిన్సిపల్స్ డా కె.రవిశంకర్, ఎస్.టి.వి.ఎస్. కుమార్, వివిధ విభాగాల డీన్ లు విభాగాధిపతులు ఉపాధ్యాయ ఉపాధ్యాయేతర సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

# గంగమ్మ చెంతకు గణేశుడు

– కోలాహలంగా నిమజ్జనా కార్యక్రమం పోలీసుల పనితీరుపై హర్షం వ్యక్తం చేసిన ప్రజలు




అనపర్తి,మేజర్‌న్యూస్ : గణపతి నవరాత్రులు ముగియడంతో ఆదివారం గణపతి నిమజ్జనా కార్యక్రమాలు జోరుగా సాగాయి.మండలంలో అనేక గ్రామాల్లో ఈ నిమజ్జనా కార్యక్రమాలను భక్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఎక్కడ ఏ విధమైన అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలీసుల పనితీరుపై ప్రజలు ఆనంద వ్యక్తం చేశారు. అనపర్తి గ్రామంలోని కుమ్మర వీధిలోని గణేష్ నిమజ్జన ఉత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆదివారం నిమజ్జనోత్సవం మంగళ వాయిద్యాలు, డప్పు, వాయిద్యాలు బ్యాండ్ మేళాలు, యువకుల నృత్యాలు నడుమ బాణసంచా కాల్పుల మధ్య శోభాయాత్రను కన్నుల పండువగా నిర్వహించారు. వివిధ వేష ధారణలు ధరించి ఊరంతా వినాయకుడుని ఊరేగించి మండప కమిటీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున విచ్చేసిన భక్త జన సందోహంతో నిమజ్జనం చేయడం జరిగింది. నిమజ్జన సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బంధ వస్తే ఏర్పాటు చేశారు.కాగా దీనికి ముందు గణేష్ లడ్డు డ్రా తీయగా అనపర్తి కి చెందిన తేలు శ్రీను కు దక్కింది. సుమారు 58 కేజీల లడ్డూను వినాయక చవితి రోజున గణేష్ చేతిలో పెట్టగా ఆదివారం నిర్వహించిన డ్రాలో తేలు శ్రీను కు గణపతి లడ్డు దక్కింది. గణపతి కి నైవేద్యంగా సమర్పించిన లడ్డు డ్రాలో దక్కించుకోవడం అదృష్టంగా భావిస్తున్నానని శ్రీను అన్నారు.

# రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడుగా చాగంటి



అనపర్తి, మేజర్‌న్యూస్ : రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడుగా అనపర్తి చెందిన చాగంటి సుబ్రహ్మణ్యం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ సంఘం తూర్పు గోదావరి జిల్లా శాఖ కార్యవర్గ ఎన్నికలు రాజమండ్రిలో గల ఎన్‌జివో హోమ్‌లో ఆదివారం ఏకగ్రీవంగా జరిగాయి.రాష్ట్ర సంఘం ఉపాధ్యక్షుడు చాగంటి మల్లికార్జున భాను ఎన్నికలు నిర్వహించి, కార్యవర్గం చేత ప్రమాణం చేయించారు. ఈ ఎన్నికల్లో అనపర్తి యూనిట్ నుండి జిల్లా ఉపాధ్యక్షులుగా చాగంటి సుబ్రహ్మణ్యం, సహాయ కార్యదర్శిగా కె.సాల్మన్ రాజులకు చోటు దక్కింది.

జిల్లా అధ్యక్షుడుగా కెజికె మూర్తి, కార్యదర్శిగా కెవిఎస్ రెడ్డి,కోశాధికారిగా పామర్తి గోపాలరావు , కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఎమ్ డి అక్బర్ ,మండలం యూనిట్స్ నుండి మరో పదిహేను మంది ఉపాధ్యక్షులు,సహాయ కార్యదర్శులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వీరికి అనపర్తి యూనిట్ అధ్యక్షులు పివిఎన్ సూర్యనారాయణ, సంఘ ప్రతినిధులు అభినందనలు తెలిపారు.

# ఆ వార్తతో మాకు సంబంధం లేదు

– పిఠాపురం ప్రొహిబిషన్ & ఎక్సైజ్ అధికారి జి.వి లక్ష్మి



పిఠాపురం,మేజర్‌న్యూస్:'సొమ్ములిస్తే వదిలేస్తారా... పిఠాపురం ఎక్సైజ్ అధికారులపై విమర్శలు అంటూ ఆంధ్రప్రభ పత్రికలో వచ్చిన వార్తతో మాకు గాని పిఠాపురం ఎక్సైజ్ స్టేషన్‌కు గాని ఎటువంటి సంబంధం లేదని పిఠాపురం ఎక్సైజ్ సీఐ జి.వి లక్ష్మి తెలిపారు. ఈమేరకు ఆదివారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. 10 సెప్టెంబర్ 2025 తేదీన పత్తిపాడు ప్రొహిబిషన్ ఎక్సైజ్ పరిధి శంఖవరం మండలం రామన్నపాలెం గ్రామంలో కాకినాడ టీం వారు దాడులు నిర్వహించి 1600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి,35లీటర్ల సారాయిని స్వాధీనం చేసుకుని, గొల్లప్రోలు మండలం చెందుర్తి గ్రామానికి చెందిన వాసంశెట్టి నూకరాజు అను వ్యక్తిపై క్రైమ్ నెంబర్324/2025 ముద్దాయిగా కేసునమోదు చేశారని పేర్కొన్నారు. సొమ్ములిస్తే వదిలేస్తారా ఎక్సైజ్ పోలీసుల తీరుపై విమర్శలు అంటూ పత్రికలో ప్రచురితమైన వార్తకు పిఠాపురం ఎక్సైజ్‌స్టేషన్‌కు ఎటువంటి సంబంధం లేదన్నారు.